క్లుప్తంగా

మేట్లు బాధ్యతగా పనిచేయాలి



మేట్లకు శిక్షణ ఇస్తున్న ఏపీఓ హరనాథరావు

రేగిడి: ఉపాధి హామీ పథకం మేట్లు బాధ్యతగా పనిచేయాలని ఏపీఓ ఎస్.హరనాథరావు అన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో చిన్నశిర్లాం,పెద్దశిర్లాం, నాయిరాలవలస, బూరాడ తదితర గ్రామాల మేట్లకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించేలా చూడాలని, నిబంధనల ప్రకారం పనులు చేయించాలని సూచించారు. ఈసీ రామినాయుడు, టీఏలు సత్తిరాజు, పార్థసారథి, సూర్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై ఆరా



నాయిరాలవలసలో ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను పరిశీలిస్తున్న ఏఓ మురళీకృష్ణ

రేగిడి: వన్నలి, అక్కన్నఅగ్రహారం, చాటాయివలస, నాయిరాలవలస గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఏఓ మురళీకృష్ణ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియపై సిబ్బందిని ఆరా తీశారు. కేంద్రాలకు ధాన్యం తరలించిన రైతుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయించిన రైతులకు రెండు రోజుల్లో ధాన్యం నగదు జమకాకుంటే రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ముంపు ప్రాంతాల పరిశీలన



జయప్రకాష్ మున్సిపల్ పాఠశాల వద్ద ముంపునకు గురయిన ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ రామలక్ష్మి, తదితరులు

బొబ్బిలి: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలో జలమయమైన ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. మున్సిపల్ మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌లు కారిపోతున్నాయంటూ అద్దెకు తీసుకున్న యజమానులు కమిషనర్‌కు చూపించారు. ఆమె వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం జయప్రకాష్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల సమీపంలో ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. వర్షపునీరు మళ్లించే చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

సచివాలయం సందర్శన



స్వామిత్వ సర్వే తీరును మ్యాప్ ద్వారా తెలుసుకుంటున్న డీపీఓ

బొబ్బిలిరూరల్: మండలంలోని మెట్టవలస గ్రామ సచివాలయాన్ని జిల్లా పంచాయితీ అధికారి వెంకటేశ్వరరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, విధుల తీరును పరిశీలించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. స్వామిత్వ సర్వే తీరును కాశిందొరవలస, నారాయణప్పవలస కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. మ్యాప్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ పప్పు రవికుమార్, ఇతర అధికార సిబ్బంది ఉన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు



రేగిడి : పనసలవలసలో బోరు బాగుచేస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలోని పనసలవలస గ్రామంలో పాడైన తాగునీటి చేతిబోర్లకు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ శుక్రవారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రామంలోనైనా తాగునీటి బోర్లు పనిచేయకుంటే సచివాలయాల్లో ఫిర్యాదులు చేయాలని ప్రజలకు సూచించారు. పనసలవలసలో బోర్ల మరమ్మతులను సర్పంచ్ గేదెల గోవిందరావు పర్యవేక్షించారు.

- అకాల వర్షాలతో రబీ అపరాలకు నష్టం
- మొక్కదశలోనే చనిపోతున్న మినప, పెసర పంటలు
- జిల్లాలో 11,711 హెక్టార్లలో అపరాల సాగు

రైతన్నల పెట్టుబడి వర్షార్పణం



సంతకవిటి మండలం సిరిపురం వద్ద మినప పంటలో చేరిన నీరు

రాజాం:

అకాల వర్షాలు అపరాలు సాగుచేస్తున్న రైతులను నిలువునా ముంచాయి. ప్రతీ ఏడాది రైతులు ఖరీఫ్ వరి సాగు చేసిన పొలాల్లో రబీ అపరాలు సాగు చేస్తుంటారు. వరిపంట కోతదశలో ఉండగానే పొలాల్లో అపరాల విత్తనాలు జల్లుతారు. మూడునెలల వ్యవధిలోనే అపరాలు కోతదశకు వస్తాయి. ఎకరానికి రూ.20 వేలు దాటి ఆదాయాన్ని తెచ్చిపెడతాయి. ఈ పంటలపై ప్రకృతి కన్నెర చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడురోజులుగా కురుస్తున్న వర్షాలు అపరాల పంటలకు అపార నష్టాన్ని మిగులుస్తున్నాయి. పొలాల్లో నీరు చేరి మొక్కలు చివికిపోయి కుళ్లిపోతున్నాయి. పంట ప్రారంభదశలోనే పాడైపోతోంది. ఈఏడాది జిల్లా వ్యాప్తంగా 11,711 హెక్టార్లలో అన్నదాతలు అపరాల సాగుచేస్తున్నారు. 8,359 హెక్టార్లలో మినప, 3,112 హెక్టార్లలో పెసర పంట సాగుచేయగా, 240 హెక్టార్లలో ఉలవలు పండిస్తున్నారు. ఈపంటల్లో మినప, పెసర పంటలకు మంచి డిమాండ్ ఉంది. ఎకరానికి 3 నుంచి 4 క్వింటాళ్ల పంట దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో



వంగర మండలం మద్దివలసలో దెబ్బతిన్న అపరాల పంట

క్వింటాల్ మినప, పెసర ధర రూ.8 వేల నుంచి రూ.9 వేలు పలుకుతోంది. ఎకరానికి రైతులు సాధారణంగా 16 కిలోల వరకు విత్తనాలు వేయాల్సి ఉంటుంది. ఈఏడాది రబీసాగుకు అపరాల విత్తనాలను ప్రభుత్వం పెద్దగా సరఫరా చేయకపోవడంతో రైతులు ప్రైవేట్ దుకాణాల్లో కిలో పెసర, మినప విత్తనాలు రూ.100 నుంచి రూ.150 వరకు చెల్లించి కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది.సస్యరక్షణ చర్యల నిమిత్తం ఎకరానికి రూ.3 వేల వరకు ఖర్చు చేశారు. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో నీరు చేరడంతో పెసర, మినప మొక్కలు చనిపోతున్నాయి. వర్షాలు ఊహించిన కంటే అధికంగా కురవడంతో రైతన్నల పెట్టుబడి వర్షార్పణమైంది.

మళ్లీ సాగు చేసే అవకాశం లేదు

ఖరీఫ్‌లో ఎక్కువగా రైతులు వరి, మొక్కజొన్న సాగుచేస్తుంటారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా వరి నారు పోతే మళ్లీ వరినారు సిద్ధం చేసుకునే అవకాశం రైతులకు ఉంటుంది. ఇప్పుడు అపరాల సాగులో ఆ పరిస్థితి ఉండదు. ఖరీఫ్ వరికోతల ముందే పొలాల్లో అపరాల విత్తనాలు చల్లుతారు. అలా చేస్తేనే ఆ విత్తనాలను పక్షుల నుంచి కాపాడుకునే వీలుంటుంది. ఇప్పుడు పంట పాడవడంతో మళ్లీ పొలాల్లో అపరాల విత్తనాలు వేసేందుకు అవకాశం లేదు. మళ్లీ వరి సాగుచేద్దామంటే జిల్లా వ్యాప్తంగా సాగునీటి వనరులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. తోట పల్లి, మడ్డువలస, నారాయణపురం వంటి సాగునీటి కాలువలు ద్వారా ఖరీఫ్‌లోనే సక్రమంగా సాగునీరు అందలేదు. రబీలో ఆరుతడి పంటలకు నీరందించే అవకాశం ఉండదు.

జాగ్రత్తలు పాటించాలి



అపరాల సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలి. పొలాల్లో చేరుతున్న నీటిని దిగువకు మళ్లించాలి. వర్షాలు తగ్గిన వెంటనే రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయశాఖ సిబ్బందిని పొలాల్లోకి తీసుకెళ్లి వారి సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. లేకుంటే పంటలు దెబ్బతింటాయి. అల్పపీడనం ప్రభావంతో ఊహించిన కంటే అధికంగా వర్షాలు కురుస్తుండడం వల్ల పెసర పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. – వి.తారకరామారావు, వ్యవసాయశాఖ జిల్లా అధికారి, విజయనగరం

పంటమొత్తం చనిపోతోంది



రెండున్నర ఎకరాల్లో పెసర, మినప పంట వేశాం.ఇంత పెద్ద ఎత్తున వర్షాలు పడుతాయని అనుకోలేదు. చిన్న జల్లులు కురుస్తాయని అనుకున్నాం. కానీ గత మూడురోజులుగా వర్షాలు కురుస్తునే ఉన్నాయి. పొలాల్లో నీరు చేరడంతో మినప మొక్కలు చివికిపోయి పూర్తిగా చనిపోతున్నాయి. రూ. 20వేల వరకూ పెట్టుబడి పెట్టాను. మొత్తం నష్టపోయినట్టే. – రాగాల వెంకటరమణ, రైతు, మద్దివలస, వంగర మండలం.

మొత్తం ముంపులోనే



మూడు ఎకరాల్లో మినప పంట వేశాం. మరో రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేస్తున్నాం. ఈ వర్షాలకు పంటలు పాడయ్యాయి. పొలాల్లో నీరు నిలిచిపోవడంతో పెసర, మినప మొక్కల ఆకులు కుళ్లిపోతున్నాయి.ఖరీఫ్ పంటల కంటే రబీలో సాగుచేసే పంటల ద్వారానే తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చేది. ఇప్పుడు పెట్టుబడి కూడా నష్టపోతున్నాం. – పి.రాంబాబు, రైతు, సిరిపురం, సంతకవిటి మండలం.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

- డీపీఓ టి.వెంకటేశ్వరరావు



రామభద్రపురం మేజర్ పంచాయతీలో సూచనలు చేస్తున్న డీపీఓ వెంకటేశ్వరరావు

రామభద్రపురం: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలకు ఆరోగ్యం సిద్ధిస్తుందని, పల్లెల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని డీపీఓ టి.వెంకటేశ్వరరావు కోరారు. సోంపురం, తారాపురం, రామభద్రపురంలలో శుక్రవారం ఆయన పర్యటించారు. స్వమిత్ర కార్యక్రమం రికార్డులు పరిశీలించారు. ఆయా కార్యదర్శులను ఆరా తీశారు. వర్షాలు కురుస్తున్నాయని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తాగునీటి ట్యాంకులు, చేతిపంపుల వద్ద పరిసరాలను పరిశుభ్రం చేసి బ్లీచింగ్ చల్లి క్లోరినేషన్ పనులు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, ఈఓపీఆర్డీ వెంకటరమణ, ఈఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలకు తరలిరావాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ జాతీయ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా 21వ తేదీన పార్టీ మండల కార్యాలయంలో నిర్వహించనున్న వేడుకలకు పార్టీ శ్రేణులు తరలిరావాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. శనివారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తామని, పలు సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఎంపీపీ వెంట పార్టీ మండలాధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా భూముల రీ సర్వే



భూముల రీసర్వేపై గ్రామ సచివాలయ సర్వేయర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టనున్న భూముల రీసర్వేను పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ సూచించారు. పణుకువలస గ్రామ సచివాలయంలో శుక్రవారం సచివాలయ సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమక్షంలో భూముల సరిహద్దులు గుర్తించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో భూముల రీసర్వే పూర్తయ్యిందని, మిగిలిన పంచాయతీల్లో కూడా రీసర్వే చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో పణుకువలస సర్పంచ్ చందక సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

నేడు రక్తదాన శిబిరం



డాక్టర్ తలే రాజేష్

రాజాం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించనున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని, 10 గంటలకు సన్‌రైజ్ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. రాజాం మున్సిపాలిటీతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

అన్నదానం

బొబ్బిలి: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజును బొబ్బిలిలో ఒక రోజు ముందుగానే శుక్రవారం జరుపుకున్నారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్ నిరుపేదలకు అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ విభాగం మాజీ అధ్యక్షుడు షేక్ హమీద్, నౌషాద్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్యసమావేశం

బాడంగి: మండలపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఎంపీపీ భోగిగారి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

పేర్లు నమోదు

బాడంగి: ప్రస్తుత విద్యా సంవత్సరంలో పరీక్ష విధానంపై పరీక్షాపే చర్చ–2025 కింద భారతప్రధాని నరేంద్రమోదీ విద్యార్థులు, తల్లితండ్రులు, టీచర్లతో నేరుగా మాట్లాడతారని ఎంఈఓ రాజేశ్వరి శుక్రవారం తెలిపారు. దీనికోసం వచ్చేనెల 14వ తేదీ వరకు పేర్లు నమోదుచేసుకోవాలని సూచించారు. హెచ్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

ముగిసిన మహామంత్ర సప్తాహం

సంతకవిటి: స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 13వ తేదీన ఉదయం 7 గంటలకు ప్రారంభమైన మహామంత్ర సప్తాహం శుక్రవారం ఉదయం 7గంటలతో ముగిసింది. ఏడురోజుల పాటు హరే రామ హరే కృష్ణ నామమంత్రంతో సప్తాహం నిర్విరామంగా కొనసాగింది. కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

తుఫాన్ నీటితో నిండిన సచివాలయం



సచివాలయంలో చేరిన నీటిని బకెట్‌కు తోడుతున్న ఉద్యోగి

మెంటాడ: మండలంలోని కొండలింగాలవలస గ్రామ సచివాలయం రెండు రోజులుగా కురుస్తున్న తుఫాన్ వర్షాల ప్రభావంతో పూర్తిగా కారిపోగా కార్యాలయం వరదనీటితో నిండిపోయింది. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టిన గ్రామ పంచాయతీ భవనంలోనే గ్రామ సచివాలయం ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని బీటలు వారి శ్లాబ్ నుంచి వరద నీరు పూర్తిగా కార్యాలయం అంతా చేరింది. కార్యాలయంలోని ముఖ్యమైన కంప్యూటర్లు, బీరువాలు కూడా తడిసిపోయాయి. దీంతో సచివాలయం ఉద్యోగులు వరదనీరు కారుతున్న చోట బకెట్లు పెట్టి నీటిని కార్యాలయం అంతా చేరకుండా చుశారు. అలాగే కార్యాలయంలో చేరిన వరదనీటిని ఉద్యోగులు బయటకు బకెట్లతో తోడి సచివాలయంలోని వస్తువులను కాపాడుకున్నారు.

భూ సమస్యలకు పరిష్కారం



అలజంగి గ్రామ రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

బొబ్బిలి రూరల్: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎం.శ్రీను అన్నారు. మండలంలోని అలజంగి గ్రామ సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ శివున్నాయుడు, ఆర్‌ఐ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

కోడ్ ముగిసినా.. తొలగని ముసుగు!



స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు రద్దుయ్యాయి. కోడ్ ముగిసింది. నేతల విగ్రహాలకు వేసిన ముసుగులను మాత్రం సంబంధిత అధికారులు తొలగించలేదు. దీనికి రాజయ్యపేట గ్రామంలో ప్రధాన రోడ్డు పక్కనే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు ఉన్న దృశ్యమే నిలువెత్తు సాక్ష్యం. – తెర్లాం

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి



బొద్దాం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: గ్రామ సచివాలయాల్లో రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని, ప్రజలకు సేవలు సక్రమంగా అందించాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని బొద్దాం, గార్రాజుచీపురుపల్లి తదితర గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో శుక్రవారం ఆయన తనిఖీలు చేశారు. స్వామిత్వ సర్వేపై సిబ్బందిని ఆరా తీశారు. సిటిజన్ మిస్సింగ్ డేటా ఎంట్రీ, ఎంఎస్‌ఎంఈ సర్వే, స్వర్ణపంచాయతీ డేటా కరెక్షన్, పల్లె పండగ పనుల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. సచివాలయాలకు అందే అర్జీలను సకాలంలో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



వంగర: వంగరలో నిరసన తెలుపుతున్న దళిత, బహుజన జేఏసీ నేతలు

వంగర: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచితంగా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాపై అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు తక్షణమే మంత్రిపదవి నుంచి బర్తరఫ్ చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అమి త్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ మండల కేంద్రంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ సింబల్ ఆఫ్ నాలెడ్జ్ అని, ప్రపంచ మేధావిగా అందరూ కొనియాడుతుంటే అమిత్‌షా చులకనగా మాట్లాడడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత, బహుజనుల మనోభావాలు దెబ్బతీసే విధంగా అమిత్‌షా మాట్లాడారని మండిపడ్డారు. బహుజన జేఏసీ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మజ్జి గణపతి, దళిత సేవా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.గణపతిరావు, దళిత ఐక్యవేదిక మండల అధ్యక్షుడు చిత్తిరి గంగులు, సామాజిక న్యాయపోరాట సమితి మండల అధ్యక్షుడు డర్రు రాంబాబు, బహుజన ఐక్యవేదిక అధ్యక్షుడు కారు రామారావు, దళిత, బహుజన నాయకులు సింహాచలం, రాజు, ఉదయ్, తిర్లంగి సింహాచలం, చిన్న రాంబాబు, బుజ్జి, సాయి, శ్రీరాములు, అప్పన్న పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి

రాజాం సిటీ: డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచితంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తక్షణమే క్షమాపణలు చెప్పా లని రాజాం నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి బొత్స బుద్ధుడు, సమతాసైనిక్‌దళ్ జిల్లా కార్యదర్శి రెయ్యి రామకృష్ణ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలు మేధావిగా గుర్తించిన అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లోనే అవమానించినందుకు తక్షణమే అమిత్‌షాను అరెస్టు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. దీనిపై కేంద్రం స్పందించకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

వీడని వర్షం

రైతులను తుఫాన్ కష్టాలు వీడడం లేదు. అల్పపీడనం ప్రభావంతో వర్షాలు జోరందుకున్నాయి. పల్లపు పొలాల్లో నీరు చేరింది. అపరాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మరోవైపు పొలాల్లో పెట్టిన వరిచేను కుప్పలు తడిసిముద్దవుతున్నాయి. పొలాలు, కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులు, బస్తాలపై టార్పాలిన్లు కప్పినా ఏ క్షణంలో వర్షపునీరు ముంచెత్తుతుందోనన్న బెంగ రైతన్నను వెంటాడుతోంది. మరోవైపు కూరగాయల పంటలు వర్షార్పణమయ్యాయి. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పల్లెల్లో పర్యటించి పంట సంరక్షణపై సూచనలిస్తున్నారు. – సాక్షినెట్‌వర్క్



రామభద్రపురంలోని పొలాల్లో సగానికి నీట మునిగిన వరి కుప్పలు



రామభద్రపురం: పొట్టిచిక్కుడు పంటలో వర్షపునీరు



బాడంగి: వరికుప్పలను పరిశీలిస్తున్న ఏఓ శిరీష



తెర్లాం: ఆమిటి రైస్ మిల్లులో ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్



రాజాం సిటీ: అంతకాపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రేణుకాసాయి



బొబ్బిలిరూరల్: ధాన్యపు బస్తాలను భద్రపరచడంపై సూచనలిస్తున్న వీఏఏ



సంతకవిటి: మద్దూరుపేట వద్ద తడిసిన వరి కుప్పలు

నేడు మండల సర్వసభ్య సమావేశం

సంతకవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సిరిపురపు మంజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు హాజరవుతారని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని కోరారు.